సాక్షి
కర్నూలు
శుక్రవారం, 23, జూన్, 2023



'ఒలింపిక్' స్ఫూర్తి

కర్నూలులో గురువారం ఒలింపిక్ డే రన్ నిర్వహించారు. నగర నలుమూలల నుంచి విద్యార్థులు, ప్రజాప్రతినిధులు ఒలింపిక్ జ్యోతులతో పరుగులో పాల్గొన్నారు. 8లో▸



శ్రీమఠంలో భక్తుల రద్దీ

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామి మఠం గురువారం భక్తులతో కిక్కిరిసింది. పీఠాధిపతి శ్రీ సుభుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారు జాము నుంచి ప్రత్యేక పూజలు చేపట్టారు.



నవోదయ ఫలితాలు విడుదల

బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశానికి నిర్వహించిన పరీక్ష ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. 80 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 8లో▸

న్యూస్‌రీల్

పాడుపు మహిళలకు నాటు కోళ్ల యూనిట్లు

- 5వేల యూనిట్లు పంపిణీ చేయాలనేది లక్ష్యం

కర్నూలు(అగ్రికల్చర్): స్వయం సహాయక సంఘాల్లోని మహిళల జీవనోపాధులను మెరుగు పరిచేందుకు 2023–24లో పెద్ద ఎత్తున నాటు కోళ్ల పెంపకాన్ని చేపట్టనున్నట్లు డీఆర్‌డీఏ-వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. గుడ్ల ఉత్పత్తి, మాంసానికి పనికొచ్చే అసిల్ క్రాస్ రకం నాటు కోళ్లు పాడుపు మహిళలకు వచ్చే నెల మొదటి వారం నుంచి పంపిణీ చేస్తామన్నారు. ఈ ఏడాది ప్రతి మండలంలో 200 నాటు కోళ్ల యూనిట్ల ప్రకారం జిల్లా మొత్తంగా 5వేల యూనిట్లు పంపిణీ చేయాలనేది లక్ష్యమని, ఇప్పటికే 800 మంది మహిళలు యూనిట్లు తీసుకునేందుకు ముందుకొచ్చారని గురువారం ఆయన విలేకరులకు తెలిపారు. యూనిట్‌లో కేజీ బరువున్న 8 పెట్టలు, 3 పుంజులు ఉంటాయని, వీటితో పాటు మూడు రకాల మందులు కూడా అందజేస్తామన్నారు. యూనిట్ కాస్ట్ రూ.3,250 ఉంటుందని, ఇందులో సబ్సిడీలు లేవన్నారు. ఒక్కో కోడి ఏడాదికి 100 నుంచి 120 గుడ్లు పెడుతాయన్నారు.

నేడు, రేపు ఎంటీఎస్ టీచర్లకు కౌన్సెలింగ్

కర్నూలు సిటీ: ఉమ్మడి కర్నూలు జిల్లాలో 1998, 2008 డీఎస్సీల ద్వారా నియమితులైన మినిమం టైం స్కేల్ (ఎంటీఎస్) టీచర్ల రెన్యూవల్‌కు శుక్ర, శనివారాల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డీఈఓ డాక్టర్ వీ రంగారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 1998 డీఎస్సీ ద్వారా ఎంపికైన 209 మంది, 2008 డీఎస్సీ ద్వారా ఎంపికైన 175 మంది.. మొత్తం 384 మంది మినిమం టైం స్కేల్ టీచర్లు ఉన్నారన్నారు. 2008 డీఎస్సీ టీచర్లకు నేడు(శుక్రవారం), 1998 డీఎస్సీ టీచర్లకు రేపు(శనివారం) కౌన్సెలింగ్ నిర్వహించనున్నామని పేర్కొన్నారు. వీరందరూ ఆయా మండలాల విద్యాధికారులు ధ్రువీకరించిన సర్వీస్ సర్టిఫికెట్లతో ఏక్యాంపులోని మాంటిస్సోరి హైస్కూల్‌లో నిర్వహించనున్న కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు.

మెరిట్ ప్రాతిపదికన సీఆర్‌టీల నియామకం



మాట్లాడుతున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు (సెంట్రల్): కస్తూర్బా పాఠశాలల్లో కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్(సీఆర్‌టీ) నియామకాలను పూర్తి మెరిట్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య తెలిపారు. అభ్యర్థుల అకాడమిక్‌కు 85 మార్కులు, మిగిలిన 15 శాతం మార్కులకు స్కిల్ టెస్టు నిర్వహిస్తామన్నారు. గురువారం సాయంత్రం ఆమె కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో సమగ్ర శిక్ష ఏపీసీ కె.వేణుగోపాల్‌తో కలసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 233 సీఆర్‌టీల నియామకానికి నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. రెండు జిల్లాల్లో 7,850 మంది దరఖాస్తు చేసుకున్నారని.. ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున 634 మందిని ఎంపిక చేశామన్నారు. రెండు రోజులుగా సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగుతోందని, ఆ తర్వాత జేసీ అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ ఆధ్వర్యంలో స్కిల్ టెస్ట్ నిర్వహిస్తామన్నారు. పార్ట్ టైం సీఆర్‌టీలకు అత్యధికంగా 8 మార్కుల వెయిటేజీ ఇచ్చామన్నారు. అందువల్ల ఎవరు కూడా దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని, పూర్తి పారదర్శకంగా ఎంపిక చేపడతామన్నారు.

నూతన విద్యా విధానం విద్యార్థులకు మేలు



వీసీ ఆనందరావును సత్కరిస్తున్న దృశ్యం

డోన్ టౌన్: జాతీయ నూతన విద్యా విధానంతో విద్యార్థులకు ఎంతో మేలు కలుగుతుందని రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆనందరావు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జాతీయ విద్యా విధానంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన విద్యా విధానంలో విద్యార్థులు వారికిష్టం వచ్చిన సబ్జెక్టును ఎంచుకుని నైపుణ్యాన్ని మెరుగు పర్చుకునే అవకాశం కలిగిందన్నారు. కోఆర్డినేటర్ స్వరూపరాణి అధ్యాపకులు నూతన విద్యా విధానంపై విశదీకరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.భారతి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో అధ్యాపకులు లలితకుమారి, కృష్ణవేణి పాల్గొన్నారు.

మాట కరువై.. వైద్యం భారమై!





వైద్యం తీరు మారుతోంది. ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో వైద్యులు రోగుల ఆవేదన వినడమే తగ్గించేశారు. వాస్తవానికి వైద్యులు రోగి చేయి పట్టుకుంటేనే సగం వ్యాధి నయమవుతుంది. ఇక యోగ క్షేమాలు తెలుసుకుంటే ఆయన మీద నమ్మకం పెరుగుతుంది. ఏం కాదులే, నేనున్నా కదా అనే భరోసా ఇస్తే చాలు.. ఇంటికి వెళ్లేలోపు కాస్త ఊరట కలుగుతుంది. ఇలాంటి వైద్యులు ఇప్పుడు ఎక్కడో కానీ కనిపించారు. రోగి తన సమస్య చెబుతుండగానే.. మందుల చీటీ సిద్ధమవుతుంది. రోగులను అక్కడి నుంచి త్వరగా పంపించేయాలనే శ్రద్ధ వాళ్ల ఆవేదన వినే విషయంలో చూపకపోవడం గమనార్హం.

- కర్నూలు నగరంలోని ఓ ఈఎన్‌టీ డాక్టర్‌కు ఎంతో వృత్తినైపుణ్యాలు ఉన్నాయి. ఆయన వద్దకు వెళితే తగ్గని వ్యాధంటూ లేదు. అయితే ముక్కుపై కోపం అనేది రోగుల భావన.
- షుగర్, థైరాయిడ్ వ్యాధులు చూసే కర్నూలులోని ఓ వైద్యుడి ప్రాక్టీస్ బాగుంది. ఈయన రోగులతో ఎక్కువగా మాట్లాడరనే అభిప్రాయం ఉంది. రోగులు చెప్పింది విని మందులు రాసిచ్చి పంపడమే.
- దయాబెటాలజిస్టుగా రాణిస్తున్న ఓ వైద్యుడు తన వద్దకు వచ్చిన వారిని పేరు పేరునా పలకరిస్తారు. వారి యోగక్షేమాలు అడిగి మరీ తెలుసుకుంటారు. ఈ కారణంగా రోగులు మళ్లీ ఆయన వద్దకే వెళ్తుంటారు.
- కర్నూలు నగరంలోని ఓ సీనియర్ గైనకాలజిస్టు అంటే రోగులకు ఎంతో ఇష్టం. ఆమె రోగుల పట్ల చూపే ఆదరణ, ఆత్మీయత అంతా ఇంతా కాదు. ఈ కారణంగానే ఏడు పదుల వయస్సు మీద పడుతున్నా ఆ దాక్టరమ్మనే ఆశ్రయిస్తుంటారు.

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వైద్యులు, పీజీలు, హౌస్‌సర్జన్లు వెయ్యి మందికి పైనే. ఇక నగరంతో పాటు ఆదోని, కోడుమూరు, ఎమ్మిగనూరు, గూడూరు తదితర ప్రాంతాల్లో ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లలో మరో 1600 పైగా వైద్యులు సేవలందిస్తున్నారు. నంద్యాల జిల్లాలోనూ మరో వెయ్యి మంది వైద్యులు ఉన్నారు. ప్రతి సంవత్సరం ఉమ్మడి జిల్లాలోని మూడు మెడికల్ కాలేజీల నుంచి 500 మంది దాకా యువ వైద్యులు డిగ్రీలు పొందుతున్నారు. వైద్యులతో పాటు వైద్యరంగంలో టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కుతోంది. అతి సూక్ష్మజీవులను గుర్తించి ఆ క్రిములు ఏ వ్యాధి తాలూకా అని చెప్పగలిగే వ్యాధి నిర్ధారణ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. ఎంతటి క్లిష్టతరమైన ఆరోగ్య సమస్యనైనా ప్రస్తుతం అధునాతన టెక్నాలజీ ద్వారా శోధించి గుర్తించే వసతులు, సౌకర్యాలు వచ్చాయి. ఈ కారణంగానే అత్యాధునిక వైద్యసౌకర్యాలున్న జిల్లా కేంద్రానికి, పెద్ద డాక్టర్లుండే ఈ ప్రాంతానికి మారుమూల ప్రాంతాల నుంచి రోగులు చికిత్స కోసం వస్తున్నారు.

వైద్యులు, రోగుల మధ్య సన్నగిల్లిన బంధం

- పరీక్షల ఆధారంగానే చికిత్స
- బాధలు వినేందుకు ఇష్టపడని అధిక శాతం డాక్టర్లు
- గతంలో నాడి పనితీరుతోనే వ్యాధి అంచనా
- ఇప్పుడు ఆమడదూరం నుంచే అరకొర వైద్యం
- నమ్మకం కోల్పోతున్న వైద్యులు

ధనార్జనే ధ్యేయంగా వైద్యం

వైఖరి(ఆటిట్యూడ్), నైతిక విలువలు(ఎథిక్స్), సమాచార నైపుణ్యాలు(కమ్యూనికేషన్స్). ప్రస్తుత వైద్యుల్లో ఈ మూడు కనిపించడం లేదనే వాదన వినిపిస్తోంది. కొందరు యువ వైద్యులు డిగ్రీ చేతికి రాగానే వారి వైఖరిలో మార్పు కనిపిస్తోంది. భావ వ్యక్తీకరణ తేడాగా ఉంటోంది. నైతిక విలువలు తగ్గిపోయి ధనార్జనే ధ్యేయంగా వైద్యం చేస్తున్నారు. ఫలితంగా రోగులు, డాక్టర్ల మధ్య మానవ సంబంధాలు మసకబారుతున్నాయి. చాలా ఏళ్ల తర్వాత తన వద్దకు వచ్చిన రోగిని గుర్తు పట్టి పేరు పెట్టి పిలిచే ఆ సాన్నిహిత్యం నేడు కరువైంది. ప్రస్తుతం వస్తున్న యువ వైద్యుల్లో ఎక్కువ మంది కార్పొరేట్ విద్యాసంస్థల నుంచి వచ్చిన వారే. ఆయా విద్యాసంస్థల్లో చదువు తప్ప ఇతర అంశాలు నేర్పించకపోవడమే ఇందుకు కారణమవుతోంది.

రోగికి ధైర్యం చెప్పేవారు కరువు



మా చిన్నప్పుడు ఊళ్లో డాక్టర్ చేయి పట్టుకుని చూసేవాడు. ఇప్పుడు పట్టణాల్లోని డాక్టర్లు నాలుగు మీటర్ల దూరం కూర్చోబెట్టి చూస్తున్నారు అనే వారు ఎక్కువయ్యారు. ఒకప్పుడు మనసారా మాట్లాడి బాధలు విని, భుజం తట్టి ధైర్యం చెప్పేవారు. ఇప్పుడు మా బాధలు చెబుతుంటే కనీసం వినడం కూడా లేదనే వారే అధికం. డాక్టర్ వద్దకు రోగి వెళ్లగానే బల్లపై పడుకోబెట్టి కాళ్లు ముడుచుకోవాలని చెప్పి చేతులు, కాళ్లు, కడుపు పట్టుకుని, ఒత్తి చూసి మరీ ఆరోగ్య లక్షణాలు కనుక్కునే డాక్టర్లు ఇప్పుడు తక్కువయ్యారనే విషయం అందరికీ తెలిసిందే. ఇప్పుడంతా మిషన్లే పరీక్షలు చేస్తాయి. వాటి ఆధారంగానే డాక్టర్లు వైద్యం చేస్తుండటం గమనార్హం.

చిరునవ్వుతో మాట్లాడాలి



డాక్టర్ల వద్దకు రోగులు ఎన్నో బాధలు, భయాలతో వస్తారు. బాధలు వినడంతో పాటు మెరుగైన వైద్యం అందించి అంతర్లీనంగా వారిలో నెలకొన్న భయాన్ని వైద్యులు పోగొడతారనే అభిప్రాయం ఉంటుంది. 90 శాతం వ్యాధులు మందులు వాడకుండానే తగ్గిపోతుంటాయి. వైద్యులు శాస్త్రీయంగా ఆలోచించి రోగుల బాధలను, భయాలను తొలగించాలి. రోగులతో చిరునవ్వు, కలుపుగోలుగా మాట్లాడి వ్యాధి లక్షణాలు తెలుసుకున్నప్పుడే మెరుగైన వైద్యం సాధ్యమవుతుంది. – డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి, జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు

రోగులను మంచి భావనతో చూడాలి



ఓ తల్లికి తన బిడ్డ ఎలా బాధలు, సంతోషాలు చెప్పుకుంటారో అలాగే డాక్టర్ వద్దకు వచ్చిన రోగి చెప్పుకునే వాతావరణం ఉండాలి. ఎవ్వరికీ చెప్పుకోలేని చాలా విషయాలు రోగులు డాక్టర్‌తోనే పంచుకుంటారు. ఓపిక, సహనంతో విని తగ్గిపోతుందిలే అని ధైర్యం చెప్పినప్పుడే రోగులకు సగం వ్యాధి నయమవుతుంది. వ్యాధి నిర్ధారణలు పరీక్షల జోలికి వెళ్లకుండా లక్షణాల ఆధారంగా చికిత్స చేసినప్పుడే నమ్మకం కలుగుతుంది. – జీఆర్.శర్మ, నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగి, కర్నూలు

నాడి పట్టేవారు కరువయ్యారు



ఒకప్పుడు డాక్టర్ వద్దకు వెళితే చేయి పట్టుకొని ఓ రెండు నిముషాలు నాడీ పనితీరు గమనించేవారు. నాడీ కొట్టుకునే విధానాన్ని బట్టి రోగి వ్యాధిని అంచనా వేసేవాళ్లు. కానీ ఇప్పుడు నాడీ పట్టే వారే కరువయ్యారు. రోగి వ్యాధి గురించి చెప్పగానే రక్తపరీక్షలు, ఎక్స్‌రేలు, స్కానింగ్‌లు అంటూ హడావుడి చేస్తున్నారు. ఆ రిపోర్టుల ఆధారంగానే చికిత్స చేస్తున్నారు. దీనివల్ల రోగిపై ఆర్థిక భారం పెరుగుతోంది. రోగి చెప్పే విషయాలు పూర్తిగా విని చికిత్స చేస్తే రోగులకు, డాక్టర్లకు మధ్య మంచి అనుబంధం ఏర్పడుతుంది. – బి.సురేష్‌బాబు, వ్యాపారి, కర్నూలు

వరుణ.. కరుణ

- ఉమ్మడి జిల్లాలో ఆశాజనకంగా వర్షాలు



భారీ వర్షాలకు డోన్ మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వెంకటనాయునిపల్లె వాగు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాను తొలకరి వర్షం పలకరించింది. నైరుతి రుతు పవనాల ప్రభావంతో బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు కర్నూలు, నంద్యాల జిల్లాలో వర్షం కురిసింది. నంద్యాల జిల్లాలోని నాలుగైదు మండలాల్లో భారీగా.. కర్నూలు జిల్లాలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. నంద్యాల జిల్లాలో రెండు రోజుల్లోనే 29.7 మి.మీ వర్షపాతం నమోదు కావడం విశేషం. గడివేముల, శ్రీశైలం, మహానంది మండలాలు మినహా అన్ని ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. వర్షాధార ప్రాంతమైన డోన్ మండలంలో 109.2 మి.మీ కుండపోత వర్షం కురిసింది. నంద్యాల జిల్లా జూన్ నెల సాధారణ వర్షపాతం 76.8 మి.మీ ఉండగా ఇప్పటి వరకు 48.5 మి.మీ.. కర్నూలు జిల్లా సాధారణ వర్షపాతం 77.7 మి.మీ ఉండగా ఇప్పటి వరకు 37.5 మి.మీ వర్షపాతం మాత్రమే నమోదైంది.

ప్రాంతం	వర్షపాతం(మి.మీ)
ఉయ్యాలవాడ	67.6
సంజామల	60.8
చాగలమర్రి	58
నందికొట్కూరు	28.4
అవుకు	28.2
వెల్దుర్తి	26.4
దేవనకొండ	24.6
పెద్దకడుబూరు	23.2
బనగానపల్లి	22.4

నాడు-నేడు పనుల ఆన్‌లైన్ తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ పాఠశాలల్లో మనబడి నాడు-నేడు పనులను వేగవంతం చేయడంతో పాటు, ఎప్పటికప్పుడు ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఆన్‌లైన్ చేయించాలన్నారు. కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో పనుల పురోగతిపై జిల్లా, మండలస్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో మనబడి నాడు-నేడు పనులకు సంబంధించి 651 తరగతి గదుల మరమ్మతులకు నిధులు మంజూరు కాగా, 624 పనులను భౌతికంగా పూర్తి చేశామని, ఇందులో 503 పనులను మాత్రమే ఆన్‌లైన్ చేశారన్నారు. విద్యుత్, తాగునీరు, రన్నింగ్ వాటర్ విత్ టాయిలెట్లు, కిచెన్ షెడ్స్ పనులను ఈనెల 30లోగా పూర్తి చేయాలన్నారు. నాడు-నేడులో భాగంగా నిర్మిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రతి వారం నిర్మాణ పనుల్లో పురోగతి సాధించాలన్నారు. ఇది వరకే నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో చాలా వరకు టాయ్‌లెట్లు లేవని, వాటిని కూడా నిర్మించాలన్నారు. పూర్తయిన అంగన్‌వాడీ కేంద్రాలకు త్వరితగతిన నీటి సదుపాయం కల్పించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సుబ్రమణ్యంకు సూచించారు. జగనన్న విద్యా కానుక కిట్లను వెంటనే విద్యార్థులకు అందించేందుకు చర్యలు తీసుకోవాలని డీఈఓ రంగారెడ్డి, సమగ్ర శిక్ష ఏపీసీ వేణుగోపాల్‌ను ఆదేశించారు. సమావేశంలో ఏపీఈడబ్ల్యూ ఐడీసీ ఈఈ ఎం.లక్ష్మీనారాయణ, ఏడీ శ్యామ్యూల్‌పాల్ పాల్గొన్నారు.

ఆదోని ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ అభివృద్ధికి అన్ని ప్రభుత్వ శాఖలు పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అమలు చేయడంతోపాటు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపన ద్వారా పెద్ద ఎత్తున జీవనోపాధులను పెంపొందించాలన్నారు. ఆదోని సమీపంలో వెజిటబుల్ సోలార్ డ్రయ్యర్‌కు సంబంధించిన గోడౌన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ వెంకటసుబ్బయ్యను ఆదేశించారు. ఇందుకోసం ఎకరం భూమిని కేటాయించాలని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు సూచించారు. ఎమ్మిగనూరులో జీన్స్ క్లస్టర్‌కు సంబంధించిన ఎంఎస్‌ఎంఈ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జిల్లా పరిశ్రమల శాఖ జీఎంకు తెలిపారు. సమావేశంలో జేసీ ఎన్.మౌర్య, సీపీఓ అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

బీసీలను మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట

- స్వార్థం కోసం వెంకటప్ప నాయుడిని వాడుకున్నారు
- 30 ఏళ్లు సేవ చేసిన బీసీ కుటుంబాన్ని విస్మరించారు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య



మాట్లాడుతున్న బొజ్జమ్మ, చిత్రంలో బీవై రామయ్య

కర్నూలు(రాజ్‌విహార్): బీసీలను మోసం చేయడంలో టీడీపీ అధినేత చంద్రబాబును మించిన నాయకుడు దేశంలో లేరని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య అన్నారు. గురువారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు బీసీల పార్టీ అని రాగం తీసి, మాయ మాటలు చెప్పి చంద్రబాబు రాజకీయల లబ్ధి పొందుతున్నారన్నారు. ఎన్నికలు పూర్తయిన తరువాత బీసీలను విస్మరించడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. కేవలం మాటలు తప్ప బీసీలు రాజకీయంగా, సామాజికంగా ఎదిగేందుకు చంద్రబాబు ఎలాంటి సహకారం అందించడం లేదన్నారు. తన స్వార్థ రాజకీయాల కోసం బీసీ నాయకుడైన కప్పట్రాళ్ల వెంకటప్ప నాయుడి వాడుకున్నారన్నారు. 30 ఏళ్లు టీడీపీకి సేవ చేసినా ఎలాంటి పదవి ఇవ్వకుండా, వెంకటప్ప నాయుడి కుటుంబాన్ని ఆదుకోకుండా విస్మరించారన్నారు. బిడ్డనిచ్చిన మామ చావుకు కారణమైన చంద్రబాబు ముందు పిల్ల పవన్‌కళ్యాణ్ ఎంత అని అన్నారు. చంద్రబాబును నమ్మి వేలాది మంది నాయకులు మోసపోగా పవన్ కళ్యాణ్‌కు కనువిప్పు కలగకపోవడం విచారకరమన్నారు. చంద్రబాబు మోసాలతో విసిగిపోయిన కప్పట్రాళ్ల బొజ్జమ్మ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితురాలై వైఎస్‌ఆర్‌సీపీలో చేరారన్నారు. బీసీలంటే బ్యాక్ వర్డ్ క్లాస్ కాదని.. బ్యాక్ బోన్, బెస్ట్ క్లాస్‌గా మార్చిన ఏకైక నాయకుడు సీఎం జగన్ అన్నారు. రాబోయే రోజుల్లో అనేక మంది టీడీపీ నేతలు వైఎస్‌సీపీలోకి రానున్నట్లు వెల్లడించారు. విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీపీ రామచంద్ర నాయుడు, పార్టీ నగర అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ, కార్పొరేటర్ శ్వేతారెడ్డి, పార్టీ నాయకులు ధనుంజయ ఆచారి, ప్రశాంత్, ఆది మూలపు సతీష్, లక్ష్మీకాంతయ్య పాల్గొన్నారు.

నాన్నను చంపితే ధైర్యం ఇవ్వని చంద్రబాబు

ఇటీవల వైఎస్సార్‌సీపీలో చేరిన జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు కప్పట్రాళ్ల బొజ్జమ్మ మాట్లాడుతూ..తన తండ్రి వెంకటప్ప నాయుడు తెలుగుదేశం పార్టీకి 30 ఏళ్లు సేవలందించారని, అయినా గుర్తింపు కల్పించలేదన్నారు. రాజకీయం, ఫ్యాక్షన్‌లో భాగంగా ఆయనను దారుణంగా చంపితే చంద్రబాబు తమ కుటుంబానికి ధైర్యం ఇవ్వలేదన్నారు. అందుకు కారణమైన కోట్ల కుటుంబాన్ని పార్టీలోకి తీసుకున్నారన్నారు. డోన్, పత్తికొండ, ఆలూరు, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లో ప్రభావితం చేసే సత్తా ఉన్న తన తండ్రిని కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీలో బీసీలకు ఎంతో మందికి పదవులు ఇచ్చి రాజకీయంగా, సామాజికంగా గుర్తింపు కల్పించారన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డితోనే బీసీలకు భవిష్యత్తు ఉందన్నారు. ముఖ్యమంత్రి లక్ష్యాల మేరకు పనిచేస్తామని వెల్లడించారు.

పత్తి పైరును తొలగించొద్దు

ఆలూరు/దేవనకొండ/గోనెగండ్ల: మొక్కలు ఎర్రగా మారాయని పత్తి పైరును తొలగించవద్దని రైతులకు కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సుజాతమ్మ సూచించారు. కరిడికొండ, కరివేముల, గోనెగండ్ల, గంజిహళ్లిలో పత్తి పైరును తొలగిస్తున్నారని తెలుసుకుని సుజాతమ్మతోపాటు డీడీఆర్ ఏడీఏ వెంకటేశ్వర్లు, డీఆర్‌సీ ఏఓ మధుమతి, ఏఓ సురేష్‌బాబు తదితరులు ఆయా గ్రామాల్లో పర్యటించారు. పత్తి పైరును పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. అధిక ఉష్ణోగ్రతలు, వర్షాల ఆలస్యం కారణంగా భూమి పోషక విలువలను కోల్పోయి పైరు ఎర్రగా మారుతోందని తెలిపారు. మొక్కలను కాపాడుకోవడానికి 19-19-19 మందు, 14-0-35 మందు 5 గ్రాములను లీటరు నీటికి కలుపుకొని బాగా తడిచేలా పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఐదు రోజుల తరువాత ఫార్ములేషన్ 4 లేదా 6 ను 5 గ్రాములు ఒక లీటరు నీటికి కలుపుకొని పిచికారీ చేసుకోవాలన్నారు. అలాగే వడ తెగులు నియంత్రణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాములను ఒక లీటరు నీటికి లేదా థయోఫినైట్‌మిథేల్ 1 గ్రాము ఒక లీటరు నీటిలో కలుపుకొని మొక్కల మొదళ్ల వద్ద వేసుకోవాలన్నారు.

రానుపోను టికెట్‌పై 10 శాతం రాయితీ

కర్నూలు(రాజ్‌విహార్): రోడ్డు రవాణా సంస్థ బస్సుల్లో రానుపోను టికెట్టు ఒకే సారి రిజర్వేషన్ చేసుకుంటే 10 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి టి.వెంకటరామం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో రెండు టికెట్లు ఒకే సారి తీసుకుంటే కేవలం తిరుగు ప్రయాణానికి మాత్రమే అవకాశం ఉండేదని, తాజాగా రానుపోను టికెట్లకూ రాయితీ వర్తించే విధంగా సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమల రావు ఉత్తర్వులు జారీ చేశారని వెల్లడించారు. ఈ సదుపాయం ఏసీ, నాన్ ఏసీ బస్సుల్లో అందుబాటులో ఉందని, సద్వినియోగం చేసుకోవాలని ప్రయాణికులను కోరారు.

క్లుప్తంగా

మూడు ఎర్రమట్టి లారీలు సీజ్

కర్నూలు (న్యూసిటీ): అనుమతి లేకుండా ఎర్ర మట్టిని తరలిస్తున్న మూడు లారీలను సీజ్ చేయడంతోపాటు రూ.3 లక్షలు జరిమానా విధించినట్లు జిల్లా మైనింగ్‌శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. లారీల యజమానిపై కేసు నమోదు చేయించామని పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఎక్కడైనా అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, భారీగా జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఆత్మకూరు: కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారిలోని కరివేన గ్రామ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాల ఇలా ఉన్నాయి. పాములపాడు మండలం ఎర్రగూడూరు గ్రామానికి విజయ్‌కుమార్(26) తన భార్య డీరాను తీసుకొని గురువారం ఆత్మకూరుకు వెళ్లారు. అక్కడ సొంత పని పూర్తయిన తర్వాత స్వగ్రామానికి తిరిగివెళ్తండగా బానుముక్కల, కరివేన మధ్యలో ఉన్న వంతెన వద్ద బైక్‌ను పాములపాడు నుంచి ఆత్మకూరుకు వస్తున్న టాటాఏస్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో దంపతులు ఇద్దరు బైక్‌పై నుంచి ఎగిరి పడ్డారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని 108లో కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యలో విజయ్‌కుమార్ మృతి చెందాడు. కుటుంబీకులకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇంజినీర్స్ కాలనీలో చోరీ

కర్నూలు (టౌన్): నగరంలోని ఇంజినీర్స్ కాలనీలో చోరీ జరిగింది. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... డాక్టర్ వికే లావణ్య కుటుంబం లక్కీ అపార్టుమెంటులో నివాసం ఉంటోంది. కుమారుడి మెడికల్ ఎంట్రెన్స్ టెస్ట్ కోసం వికే లావణ్య ఇంటి తాళం వేసి ఈనెల 19వ తేదీ కర్నూలు నుంచి సూరత్‌కు వెళ్లారు. ఈనెల 21వ తేదీ సాయంత్రం అపార్టుమెంట్ వాచ్‌మ్యాన్ చెత్త కోసం ఇంటికి వెళ్లి చూడగా.. తాళం తీసి ఉండటం గమనించాడు. చోరీ జరిగిందని ఫోన్ ద్వారా సూరత్‌లో ఉన్న యజమానికి సమాచారం ఇచ్చారు. ఆమె తన సోదరి విజయ సవితకు ఫోన్ చేసి విషయం చెప్పారు. విజయ సవిత ఇంటికి చేరుకుని బీరువాను పరిశీలించగా అందులో ఉన్న బంగారు చైన్, నక్లెస్, కమ్మలు (మూడు తులాలు), వెండి వస్తువులతో పాటు మొత్తం రూ. లక్ష నగదు దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

క్రీడా దీప్తి.. ఒలింపిక్ స్ఫూర్తి

- కర్నూలులో సందడిగా సాగిన ఒలింపిక్ డే రన్
- క్రీడా జ్యోతులతో నగర వీధుల గుండా పరుగు
- పాల్గొన్న ఎంపీ, మేయర్, మాజీ ఎమ్మెల్యేలు



ఒలింపిక్ డే రన్‌లో పాల్గొన్న మేయర్ రామయ్య, విద్యార్థులు



క్రీడాపోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీ సంజీవ్‌కుమార్, ముఖ్య అతిథులు


నృత్యం చేస్తున్న బాలిక

కర్నూలు(రూరల్): ఒలింపిక్ డేను పురస్కరించుకుని జిల్లా క్రీడాశాఖ, జిల్లా ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో గురువారం కర్నూలులో ఒలింపిక్ డే రన్ నిర్వహించారు. నగరంలోని నాలుగు ప్రధాన కూడళ్ల నుంచి పరుగు ప్రారంభమయ్యింది. ఔట్‌డోర్ స్టేడియం వద్ద రాష్ట్ర ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు కేఈ ప్రభాకర్, సిల్వర్‌జూబ్లీ కళాశాల వద్ద కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, నగర మేయర్ బీవై రామయ్య, వన్‌టౌన్ వద్ద సీఐ నాగశేఖర్, చెన్నమ్మ సర్కిల్ వద్ద దండు లక్ష్మీకాంతరెడ్డి, ఒలింపిక్ డే రన్‌ను ప్రారంభించారు. నాలుగు చోట్ల నుంచి బయలుదేరిన పరుగు నగర వీధుల గుండా క్రీడా జ్యోతులతో రాజ్‌విహార్ సర్కిల్‌కు చేరుకుంది. అక్కడి నుంచి క్రీడా నినాదాలతో ఆర్‌ఎస్ రోడ్డు మీదుగా ఔట్‌డోర్ స్టేడియం వెళ్లారు. క్రీడాశాఖ సీఈఓ రమణ ప్రారంభోపన్యాసంతో ఒలంపిక్ డే ఉత్సవాలను ఔట్‌డోర్ స్టేడియంలో మొదలుపెట్టారు. ఈ సందర్భంగా ఎంపీ సంజీవ్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తూ బహుమతులు అందజేస్తోందన్నారు. మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ సెల్‌ఫోన్ వద్దు... ఆటలు ముద్దు అని పిలుపునిచ్చారు. క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని, శారీరకంగా దృఢంగా ఉంటారన్నారు. కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఒలింపిక్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఈ ప్రభాకర్ మాట్లాడుతూ.. ఒలింపిక్ డే రన్ విజయవంతమైందని, ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్న కార్యక్రమాలు చేపడతామన్నారు. డీఎస్పీ మహబూబ్ బాషా , గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ శంకర్ శర్మ , కేడీసీసీబీ మాజీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి , యోగా సంఘం నాయకుడు శ్రీధర్‌రెడ్డి మాట్లాడారు. ఒలింపిక్ డే రన్‌లో పాల్గొన్న వారికి గ్రీన్‌కో వారు ఉచితంగా టీషర్టులు పంపిణీ చేశారు. విజయ డెయిరీ ఆధ్వర్యంలో క్రీడాకారులకు ఉచితంగా మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు. వారం రోజుల పాటు నిర్వహించిన క్రీడల్లో గెలుపొందినవారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ శమంతకమణి, ఒలింపిక్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జగదీష్ కుమార్, శ్రీనివాసులు, సునీల్ కుమార్, గంగాధర్, రాజశేఖర్, శాప్ కో–ఆర్డినేటర్ శ్రీనాథ్, రుద్రారెడ్డి, షరీఫ్, ఈశ్వర్ నాయుడు, అవినాష్, పాల్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు దాటుతుండగా ప్రమాదం

- కోలుకోలేక వ్యక్తి మృతి


మల్లికార్జున(ఫైల్)

ఆదోని అర్బన్: రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన వ్యక్తి కోలుకోలేక గురువారం మృతి చెందాడు. మృతుని బంధువులు, ట్రాఫిక్ పోలీసులకు తెలిపిన వివరాలు.. ఆదోని పట్టణం భీమిరెడ్డి కాలనీకి చెందిన మల్లికార్జున(46) బుధవారం రాత్రి బేల్దారి పని ముగించుకుని నడుచుకుంటూ ఇంటికొస్తుండగా ఆలూరు రోడ్డులో గుర్తు తెలియని బైకు వచ్చి ఢీకొట్టింది. తీవ్ర గాయాలకు గురైన అతడిని వెంటనే చికిత్స నిమిత్తం ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతిచెందాడు. మృతునికి భార్య రంగమ్మ, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

నకిలీ ఎరువుల సీజ్


సీజ్ చేసిన ఎరువులను చూపిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

కోవెలకుంట్ల: పెద్దకొప్పెర్ల గ్రామంలో అనుమతులు లేని 270 బస్తాల రసాయన ఎరువులను గురువారం సీజ్ చేసినట్లు ఇన్‌చార్జ్ ఏడీఏ నిరంజన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో కొందరు వ్యక్తులు జేవీపీ ఫాస్ఫో జిప్సమ్‌ను విక్రయిస్తున్నట్లు సమాచారం అందటంతో దాడి చేశామన్నారు. స్టాక్‌ను పరిశీలించగా ఎరువు బస్తాలపై ఎలాంటి పోషకాల శాతం, ఎమ్మార్పీ, తయారీ, తదితర వివరాలు లేకపోవడంతో నకిలీ ఎరువులుగా గుర్తించి సీజ్ చేశామన్నారు. రైతు భరోసా కేంద్రాలు, ప్రభుత్వ అనుమతి పొందిన షాపుల్లో మాత్రమే విత్తనాలు, రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు.

ఏఆర్‌టీ సెంటర్‌లో అన్ని సౌకర్యాలు


వివరాలు తెలుసుకుంటున్న డాక్టర్ రమేష్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): హెచ్‌ఐవీ బాధితులకు ఏఆర్‌టీ సెంటర్‌లో అన్ని సౌకర్యాలు కల్పించాలని సీడీసీ చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్‌రెడ్డి ఆదేశించారు. కర్నూలు పెద్దాసుపత్రిలోని ఏఆర్‌టీ సెంటర్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. బాధితులకు అందిస్తున్న కౌన్సెలింగ్, మందులు, వ్యాక్సీపై ఆరా తీశారు. రక్తపరీక్షల కోసం కావాల్సిన పరికరాలు సరిగ్గా లేకపోవడంతో ఏఆర్‌టీ బడ్జెట్‌లో స్థానికంగా తీసుకోవాలని సూచించారు. అవసరమైతే నోడల్ అధికారి సహకారంతో కావాల్సిన రక్తపరీక్షలు చేయించాలన్నారు. మందుల కోసం రానివారికి ఫోన్ చేసి లేదంటే వారి ఇంటికి క్షేత్రస్థాయి సిబ్బంది పంపి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ భాస్కర్, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ అలీ హైదర్, ఏఆర్‌టీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీహరి, డాక్టర్ రాధిక, షేర్ ఇండియా ప్రాజెక్టు ఆఫీసర్లు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రాజకుమార్, సుధాకర్, నళిని, నేస్తం పాజిటివ్ నెట్‌వర్క్ జిల్లా అధ్యక్షులు సుధారాణి పాల్గొన్నారు.

సామరస్యంతో పండుగలు జరుపుకోవాలి

- ఎస్పీ కృష్ణకాంత్


మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్

ఆదోని అర్బన్: ప్రశాంత వాతావరణంలో సామరస్యంతో ఈ నెల 29వ తేదీన తొలిఏకాదశి, బక్రీద్ పండుగలను జరుపుకోవాలని ఎస్పీ కృష్ణకాంత్, సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు. గురువారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో డీఎస్పీ శివనారాయణస్వామి అధ్యక్షతన మతపెద్దలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ.. ఎవరూ చట్టాన్ని తమ చేతుల్లో తీసుకోవద్దన్నారు. ఏమైనా సమస్య వస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. సోదరభావంతో, ఐక్యతతో వేడుకలు నిర్వహించుకోవాలని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు. పండుగలకు ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, తహసీల్దార్ వెంకటలక్ష్మి తెలిపారు. సమావేశానికి ముందు ఎస్పీ కృష్ణకాంత్ పట్టణంలోని అన్ని పోలీస్‌స్టేషన్‌లను పరిశీలించారు. మహాయోగి లక్ష్మమ్మవ్వ ఆలయాన్ని, జామియా మసీదును సందర్శించారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, మార్కెట్‌యార్డు చైర్మన్ మజర్ అహ్మద్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సిసిరాదీప్తి, సీఐలు విక్రమసింహా, శ్రీనివాసనాయక్, నరసింహరాజు, పార్థసారథి, నిరంజన్‌రెడ్డి , ఎస్‌ఐలు విజయలక్ష్మి, చిన్నపీరయ్య, మతపెద్దలు ప్రకాష్‌జైన్, దేవరాజ్ డోకా, దేవిశెట్టి ప్రకాష్, ఖాజీ అల్తాఫ్‌హుసేన్, ముక్తర్‌అహ్మద్, కునిగిరి నీలకంఠ, అశ్వర్థనారాయణ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

నవోదయ ఫలితాలు విడుదల

ఎమ్మిగనూరురూరల్: బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 6 వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన ప్రవేశ పరీక్షల్లో 80 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు విద్యాలయ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ చంధిరన్ పేర్కొన్నారు. గురువారం ఫలితాలను విడుదల చేశారు.

జె1035639	జె1042740	జె1035307	
జె1037940	జె1040735	ఎన్1036986	
జె1042280	ఓ1042022	ఐ1036194	కె1036691
జె1035438	జె1038004	జె1040937	
ఎన్1037813	ఎన్1042519		
కె1042027	ఎన్1038305	కె1037472	
ఐ1035648	ఎం1038040		
జె1041003	ఎన్1038105	జె1042727	
కె1042235	ఎం1038650		
కె1041093	జె1035950	ఎం1038214	
ఐ1041139	జె1038118		
కె1035136	కె1042400	జె1042157	
కె1042503	ఐ1036144		
జె1038531	జె1041424	జె1038250	
ఓ1036724	ఎల్1036772		
ఓ1042240	ఎఫ్1040293	ఎం1036951	
జె1039705	ఐ1042752		
జె1038577	కె1037774	ఎల్1039214	
జె1036812	ఎం1041920		
ఎన్1037014	జె1039906	ఎన్103 6491	
ఎన్1041761	ఓ1037854		
ఎల్1041379	ఎఫ్1041887	ఎల్1037416	
ఎన్1037383	ఎన్1040371		
జె1036900	ఎన్1041941	కె1038000	
ఎల్1041419	ఎన్1042075		
ఎన్1035301	ఎన్1037851	ఐ1040381	
జె1036943	జె1042191	కె1038401	

చోరీకి గురైన బంగారు నగలు రికవరీ

ప్యాపిలి: జలదుర్గం గ్రామంలో 22 రోజుల క్రితం ఓ వివాహ వేడుకల్లో చోరీకి గురైన బంగారు నగలను (రూ. 3.5 లక్షలు) పోలీసులు రికవరీ చేశారు. సీఐ శ్రీరాములు తెలిపిన వివరాల మేరకు.. చాగలమర్రికి చెందిన శ్రీనివాసులు, విజయలక్ష్మి ఈ నెల 1వ తేదీన జలదుర్గంలో జరిగిన బంధువుల వివాహానికి హాజరయ్యారు. గ్రామ రచ్చబండ వద్ద వధూవరుల ఊరేగింపును చూసేందుకు వెళ్లే సమయంలో విజయలక్ష్మి తన చేతిలో ఉన్న బ్యాగును పక్కనే ఉన్న అరుగుపై ఉంచి మరచిపోయింది. కొద్ది సేపటి తర్వాత బ్యాగు అపహరణకు గురైనట్లు గుర్తించిన ఆమె స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా దొంగను గుర్తించారు. డోన్ =శ్రీరామ్ నగర్‌కు చెందిన 15 ఏళ్ల బాలుడు చోరీ చేసినట్లు గుర్తించారు. ఈ మేరకు పోలీసులు నిందితుని నుంచి చోరీ సొమ్మును రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

ఏటీఎం కార్డుతో బీమా సౌకర్యం


బాధితులకు పరిహారం అందజేస్తున్న దృశ్యం

డోన్ టౌన్: ఏటీఎం కార్డు కలిగిన వారికి బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు యూనియన్ బ్యాంక్ మేనేజర్ బోరెడ్డి తెలిపారు. ఏటీఎం కార్డు కలిగిన కున్నూరు ఎల్లకృష్ణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, ఆయన భార్యకు ప్రమాద బీమా కింద గురువారం స్థానిక బ్రాంచిలో రూ.2లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా బోరెడ్డి మాట్లాడుతూ.. జనవరి 14వ తేదీన డోన్ పట్టణ సమీపంలోని దొరపల్లె రైల్వే బ్రిడ్జి వద్ద బైకుపై వెళతుండగా ప్రమాదానికి గురై ఎల్లకృష్ణ మృతి చెందాడన్నారు. ఆయన ఏటీఎం కార్డు కలిగి ఉండటంతో ప్రమాద బీమా వర్తింపజేసినట్లు తెలిపారు.

గృహోపకరణాల పేరుతో మహిళలకు టోకరా

డోన్ టౌన్: గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు పట్టణంలో మహిళలను బురిడీ కొట్టించి రూ.లక్షల్లో దోచుకెళ్లిన సంఘటన పట్టణంలో ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు ఇలా.. గత కొద్ది రోజులుగా పట్టణంలోని చిగురమానుపేట, కొండపేట, ఇందిరానగర్‌తో పాటు దొరపల్లె, ఉడుములపాడు గ్రామాల్లో పొదుపు గ్రూపు మహిళలను ఇద్దరు వ్యక్తులు నమ్మించి మోసం చేశారు. రూ.నాలుగు వేలు కడితే గ్రైండర్, మిక్సీలతో పాటు రూ.50 వేలు రుణం ఇస్తామంటూ ఆశ చూపారు. తన పేరు లక్ష్మణరెడ్డి, గుంటూరు అని, తమ సంస్థ పేరు మణికంఠ హోం అప్లియన్స్ అని, కర్నూలు, అనంతపురం జిల్లా పామిడి పట్టణాల్లో బ్రాంచి కార్యాలయాల ఉన్నాయని మహిళలను నమ్మించారు. వారి మాటలు నమ్మిన మహిళలు మొదటగా చెల్లించిన ఒక్కరిద్దరికీ మిక్సీ, గ్రైండర్ ఇచ్చి ఆశ చూపించడంతో రూ. 4 వేలు చెల్లించారు. వారం గడిచినా వస్తువులు రాక పోవడం, రుణం మంజూరు చేయక పోవడంతో లక్ష్మణరెడ్డికి ఫోన్ చెయ్యగా స్విచ్ ఆఫ్ రావడంతో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రబలిన అతిసారం

- ఓర్వకల్లులో 40 మందికిపైగా అస్వస్థత
- ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఒకరి మృతి
- అప్రమత్తమైన జిల్లా అధికార యంత్రాంగం


బాధితుల ఆరోగ్యం గురించి ఆరా తీస్తున్న డీపీఓ నాగరాజు నాయుడు


ఓర్వకల్లు: మండల కేంద్రం ఓర్వకల్లులో అతిసార ప్రబలింది. రెండు రోజులుగా బాధితుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. గురువారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మృతి చెందగా, 40 మంది అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరోచనాలతో అస్వస్థతకు గురైన వీరిని కుటుంబీకులు స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ తరలించగా చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక రెవెన్యూ, వైద్యాధికారులు గ్రామంలో పర్యటించి ఆరోగ్య పరిస్థితులపై స్థానికులతో ఆరా తీశారు. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ సృజన, స్థానిక ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్. రామగిడ్డయ్య, జిల్లా పంచాయతీరాజ్ శాఖాధికారి నాగరాజునాయుడు, డీఎల్‌పీఓ తిమ్మక్క, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నాగేశ్వరరావు, ఆర్డీఓ హరిప్రసాద్ గ్రామానికి చేరుకొని ఆయా శాఖల పరిధిలోని మండల స్థాయి అధికారులను అప్రమత్తం చేశారు. అధికారుల బృందం గ్రామంలో పర్యటించి వ్యాధి ప్రబలిన వీధులను పరిశీలించారు. బాధితుల కుటుంబంలో వినియోగిస్తున్న నీరు, ఆహార పదార్థాలు, గ్రామంలోని ప్రధాన ఓహెచ్‌ఎస్ఆర్ ట్యాంక్‌తో పాటు రెండు మూడు మినరల్ వాటర్ ప్లాంట్‌లో నీటి నమూనాలను సేకరించి టెస్టింగ్ ల్యాబ్‌కు పంపారు. గ్రామానికి చెందిన అబ్దుల్లా అనే వ్యక్తి బుధవారం వాంతులు, విరోచనాలతో బాధపడుతూ కర్నూలు ఆసుపత్రిలో చేరగా.. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. బాధితుల ఆరోగ్య పరిస్థితిని కలెక్టర్, ఎమ్మెల్యే ఎప్పటికప్పుడు ఫోన్ ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు ఆర్‌డీఓ హరిప్రసాద్ తెలిపారు. బాధితుల ఆరోగ్య పరిస్థితి మెరుగుపడే వరకు రెండు రోజుల పాటు వైద్య, ఆరోగ్య సిబ్బంది, 108, 104 అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచుతామని ఆయన పేర్కొన్నారు.

అసలు ఏమి జరిగిందంటే..?

ఈ నెల 20వ తేదీన గ్రామంలోని సుంకులాపరమేశ్వరి దేవాలయంలో శాకాంబరీ ఉత్సవాలు నిర్వహించారు. సమరసత ధార్మిక సలహా మండలి, కురువ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవంలో ప్రస్తుతం అస్వస్థతకు గురైన వారిలో 75 శాతం మంది బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నట్లు స్థానికుల సమాచారం. వారందరూ అమ్మవారికి నైవేద్యాలు, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆ సమయంలో వారు తీసుకున్న ఆహార పదార్థాలు కలుషితం కావడంతో అస్వస్థతకు గురైనట్లు అధికారుల ప్రాథమికంగా నిర్ధారించారు. అధికారులు పంపిన నీటి పరీక్ష నమూనాల ద్వారా బాధితుల అస్వస్థతకు గల కారణాలు తెలియాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, ఎంపీడీఓ శివనాగప్రసాద్, ఆర్‌ఐ రంగస్వామి, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్ గౌడు, సర్పంచు తోట అనూష, స్థానిక నాయకులు శంకర్‌రెడ్డి, మీనిగ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు.

'వైఎస్సార్ పశు బీమా'పై ప్రత్యేక దృష్టి

- నెలాఖరులోగా లక్ష్యం పూర్తి చేసే విధంగా ఆదేశాలు


పశు సంపదకు బీమా చేస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్సార్ పశు బీమా పథకం అమలుపై జిల్లా పశుసంవర్ధకశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ప్రమాదవశాత్తు, వివిధ వ్యాధులు, ప్రకృతి విపత్తుల కారణంగా పశువులు, సన్న జీవాలు మరణిస్తే రైతులకు చేకూరే నష్టం అంతా, ఇంతా కాదు. పశుసంపద మరణిస్తే వాటిని పోషిస్తున్న రైతులను ఆదుకోడానికి ప్రభుత్వం వైఎస్సార్ పశు బీమా పథకం (లైవ్‌స్టాక్ ఇన్సూరెన్స్ స్కీమ్)ను పశుసంవర్ధకశాఖ పెద్ద ఎత్తున అమలు చేస్తోంది. బీమా చేయించే కార్యక్రమం ముమ్మరంగా జరుగుతోంది. జిల్లాలో 10,150 పశువులకు బీమా చేయించాలనేది లక్ష్యం. బుధవారం మధ్యాహ్నం సమయానికి 2,824 పశువులకు బీమా చేయించారు. ఈ నెల చివరిలోగా లక్ష్యం మేరకు పశువులకు బీమా చేయించాలని పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ గడువు విధించడంతో బీమాపైనే దృష్టి కేంద్రీకరించారు. బీమా చేయించే కార్యక్రమాన్ని జిల్లా యంత్రాంగం స్పెషల్ డ్రైవ్‌గా నిర్వహిస్తోంది. బీమా పథకంలో పాడి పశువులతో పాటు ఎద్దులు, కోడెలు, దున్నలకు కూడా అవకాశం ఇచ్చారు. సన్న జీవాల్లో గొర్రెలు, మేకలతో పాటు పందులకు కూడా బీమా సదుపాయం కల్పిస్తున్నారు. జిల్లాలో వైఎస్సార్ పశు బీమా పథకాన్ని యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ అమలు చేస్తోంది. పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రామచంద్రయ్యతో పాటు ఏడీలు, పశువైద్యులు వైఎస్ఆర్ పశుబీమా పథకం కింద బీమా చేయించడంపైనే దృష్టి సారించారు. జాతి పశువులకు రూ.30,000, నాటు పశువులకు రూ.15,000, సన్న జీవాలకు రూ.6,000 బీమా చేస్తారు. రేషన్ కార్డు కలిగిన కుటుంబానికి గరిష్టంగా 5 పెద్ద పశువులకు, సన్న జీవాలకు గరిష్టంగా రూ. 50 వరకు బీమా చేసుకోవచ్చు. పెద్ద పశువులకు చెల్లించాల్సిన ప్రీమియంలో రేషన్‌కార్డు కలిగిన రైతులకు 80 శాతం సబ్సిడీ ఉంటుంది. ఇతరులకు 50శాతం సబ్సిడీ ఉంటుంది. పెద్ద పశువులకు ఒకేసారి మూడేళ్లకు 6.4 శాతం ప్రీమియంతో బీమా చేస్తారు. సన్న జీవాలకు ఒక ఏడాదికి 3 శాతం, రెండేళ్లకు 4.50 శాతం, మూడేళ్లకు 6.25 శాతం ప్రీమియం చెల్లించాల్సి ఉంది.